సాక్షి
మంచిర్యాల / చెన్నూర్ / బెల్లంపల్లి
మంచిర్యాల । మంగళవారం । 7 । ఫిబ్రవరి । 2023
11

## క్లుప్తంగా

### ముంపు రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు రవి

**కోటపల్లి:** కాళేశ్వరం బ్యాక్ వాటర్ ముంపునకు గురైన పంటలకు నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు సంకె రవి డిమాండ్ చేశారు. సిర్సా గ్రామంలో సోమవారం తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కాళేశ్వరం బ్యాక్ వాటర్‌తో రైతుల పంటలు రెండు నుంచి మూడుసార్లు మునిగి రూ.2లక్షల నుంచి రూ.5లక్షల వరకు నష్టపోయినా ప్రభుత్వం ఆదుకోలేదని వాపోయారు. ఈ నెల 13న చలో కలెక్టరేట్ ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘం జిల్లా కార్యదర్శి ఎర్మ పున్నం, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి చందు, నాయకులు మారన్న, చంద్రన్న, రైతుసంఘం మండల కన్వీనర్ రాజన్న, భీమయ్య, కార్యదర్శి జనగామ రామయ్య, లింగయ్య, రైతులు పాల్గొన్నారు.

### హాస్టల్ ఏర్పాటు చేయండి

**చెన్నూర్:** స్థానికంగా బాలికల కాలేజీ, హాస్టల్ ఏర్పాటు చేయాలని సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు ర్యాలీ తీశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి చెన్నూర్ తహసీల్దార్ కార్యాలయానికి తరలివెళ్లి డిప్యూటీ తహసీల్దార్ గోవింద్‌కు వినతిపత్రం అందజేశారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ పూర్తి చేసుకొని కోటపల్లి, వేమనపల్లి, చెన్నూర్ మండలాల నుంచి సుమారు 300మంది విద్యార్థినులు ఉన్నత విద్యకు చెన్నూర్ వెళ్లాల్సి వస్తుందని, కానీ హాస్టల్ వసతిలేదని వాపోయారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, మండల కార్యదర్శి అనిల్, మండల అధ్యక్షుడు వంశీ, కమిటీ సభ్యులు శేఖర్, అంజన్న, రవితేజ, గర్ల్స్ కమిటీ సభ్యులు గాయత్రి, శృతి, వైష్ణవి, రాజేశ్వరి, నికిత, విద్యార్థులు పాల్గొన్నారు.

### వినతిపత్రం అందజేత

**మందమర్రిరూరల్:** మండలంలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్లను అర్హులైన వారికి వెంటనే పంపిణీ చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కాదాసి రవీందర్ డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం ఆందోళన నిర్వహించి అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రమేష్, శ్రీనివాస్, శ్రావణ్, బాబురావు, ప్రకాష్, స్వామి, కృష్ణ తదితరులు ఉన్నారు.

### సమ్మక్క-సారలమ్మకు మొక్కులు



మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

**భీమిని:** కన్నెపల్లి మండలంలోని ముత్తాపూర్ గ్రామ పరిధిలో నిర్వహిస్తున్న సమ్మక్క-సారలమ్మ జాతరకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద చిన్నారులకు బంగారం(బెల్లం)తో తులాభారం వేయించి, పుట్టువెంట్రుకలు సమర్పించి సల్లంగా చూడాలని మొక్కులు చెల్లించుకున్నారు.

### కూరగాయల ధరలు

| కూరగాయలు | ధర(కిలో) |
|---|---|
| టమాట | రూ.15 |
| పచ్చిమిర్చి | 50 |
| చిక్కుడు కాయ | 60 |
| బీరకాయ | 90 |
| వంకాయ | 60 |
| కాకరకాయ | 70 |
| బెండకాయ | 40 |
| అలసంద | 50 |
| దొండకాయ | 80 |
| సోరకాయ | 20 |
| ఆకుగోబి | 60 |
| పూగోబి | 60 |
| క్యారెట్ | 50 |
| క్యాప్సికం | 90 |
| పాలకూర | 40 |
| తోటకూర | 30 |
| ములక్కాయ | 100 |

- మంచిర్యాలఅగ్రికల్చర్



# సమస్యల్లో కళాశాలలు..!



లక్సెట్టిపేట జూనియర్ కళాశాలలో కూలిపోయిన వరండా పై భాగం



దండేపల్లిలో రేకుల షెడ్డులో కొనసాగుతున్న కళాశాల

- రేకుల షెడ్డులో తరగతులు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు

**లక్సెట్టిపేట:** ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వ కళాశాలల్లో విద్యార్థులకు విద్యనందించాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారిపోతోంది. సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. కొన్ని చోట్ల పక్కా భవనాలు లేక అవస్థలు పడుతుండగా, మరికొన్ని చోట్ల భవనాలు శిథిలావస్థకు చేరడంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. లక్సెట్టిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల శిథిలావస్థలో ఉండగా, దండేపల్లిలో పక్కా భవనం లేకపోవడంతో రేకుల షెడ్డులో కొనసాగిస్తున్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని అధ్యాపకులు వాపోతున్నారు. లక్సెట్టిపేట కళాశాలలో టాయిలెట్లు, ల్యాబ్‌లు, మౌలిక వసతులు కూడా లేవని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు పట్టించుకుని కళాశాలలకు పక్కా భవనాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

### పెచ్చులు ఊడుతున్నాయి



ప్రైవేటు కళాశాలకు వెళ్లలేక ప్రభుత్వ కళాశాలలో చేరాం. కానీ తరగతి గదులోని పై పెచ్చులు ఊడి పైన పడుతున్నాయి. సౌకర్యాలు సరిగ్గా లేకపోవడంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. నిత్యం భయం భయంగా కాలం వెల్లదీస్తూ క్లాసులు వింటున్నాం.

- రసజ్ఞ, ద్వితీయ సంవత్సరం విద్యార్థి, లక్సెట్టిపేట కళాశాల

### రేకుల షెడ్డులో తరగతులు



పక్కా భవనం లేకపోవడంతో రేకుల షెడ్డులో తరగతులు నిర్వహిస్తున్నాం. అధికారులకు చాలా సార్లు తెలిపినా పట్టించుకోవడం లేదు. అధికారులు పట్టించుకుని ప్రభుత్వ కళాశాలలపై దృష్టి పెట్టి పక్కా నూతన భవనాలు నిర్మించాలి.

- శోభ, ప్రిన్సిపాల్, దండేపల్లి జూనియర్ కళాశాల

# అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

- జీఎం సంజీవరెడ్డి



మాట్లాడుతున్న జీఎం సంజీవరెడ్డి

**శ్రీరాంపూర్:** అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి తెలిపారు. తన చాంబర్‌లో సోమవారం ఆయన అన్ని డిపార్టుమెంట్‌ల ముఖ్య అధికారుతో సమావేశం ఏర్పాటు చేశారు. ఇటీవల రామగుండం సీహెచ్‌పీలో జరిగిన అగ్ని ప్రమాదంపై చర్చించి భవిష్యత్‌లో ఇలాంటి ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. అగ్నిమాపక సాధనములు సరిగ్గా ఉన్నాయా అని చూసుకోవాలన్నారు. వీటిని ఎళ్లవేళలా అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వచ్చే వేసవి దృష్ట్యా మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఎస్ఓటూజీఎం త్యాగరాజు, ఏరియా ఇంజనీర్ రమేశ్‌బాబు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# 'హాథ్ సే హాథ్' జోడోయాత్ర ప్రారంభం



బెల్లంపల్లి: పాదయాత్రలో కాంగ్రెస్ శ్రేణులు



దండేపల్లి: నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

**బెల్లంపల్లి/దండేపల్లి/కోటపల్లి/నెన్నెల/కాసిపేట/వేమనపల్లి/లక్సెట్టిపేట/తాండూర్/మంచిర్యాల రూరల్(హాజీపూర్)/నస్పూర్/చెన్నూర్‌రూరల్:** రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్రకు కొనసాగింపుగా కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం 'హాత్ సే హాత్'జోడోయాత్ర ప్రారంభమైంది. కాంగ్రెస్ జెండాను ఆవిష్కరించి పాదయాత్రను పలువురు కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. ఊరూరా కాంగ్రెస్ శ్రేణులు ఉత్సాహంగా పాదయాత్రలో కదం కలిపారు. ఇంటింటికీ వెళ్లి కేంద్ర, రాష్ట్ర పాలక ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేఖ విధానాలను వివరించి అవగాహన కల్పించారు. బీజేపీ, బీఆర్ఎస్ ప్రజలను వాగ్దానాల్లో ముంచెత్తి నయవంచన చేస్తున్నాయని డీసీసీ అధ్యక్షురాలు సురేఖ దుయ్యబట్టారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తొలిరోజు పాదయాత్ర ఉత్సాహంగా సాగింది.బెల్లంపల్లి, నస్పూర్‌లో డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ హాజరు కాగా, హాజీపూర్‌లో డీసీసీ ఉపాధ్యక్షుడు మాధవరపు రాజేశ్వర్‌రావు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



చెన్నూర్‌లో జెండా ఆవిష్కరిస్తూ...

# 'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోండి



ముత్తాపూర్‌లో పరిశీలిస్తున్న జెడ్పీసీఈవో నరేందర్



లక్సెట్టిపేట: కంటి వెలుగును పరిశీలిస్తున్న చైర్మన్

- పలు చోట్ల శిబిరాలను పరిశీలించిన అధికారులు, ప్రజాప్రతినిధులు

**లక్సెట్టిపేట:** మున్సిపాలిటీ పరిధిలోని నాల్గో వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య సోమవారం పరిశీలించారు. ప్రజలకు మౌలిక సౌకర్యాలు కల్పించాలని, ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని వైద్యులకు సూచించారు. కంటి వెలుగు సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్ సుధాకర్, వెంకటస్వామి గౌడ్, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

**దండేపల్లి:** మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని సర్పంచ్ చంద్రకళ, ఎంపీడీవో మల్లేశం సోమవారం ప్రారంభించారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** మండలంలోని గిరిజన గ్రామమైన చిన్నగోపాల్‌పూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో కంటి వెలుగు శిబిరాన్ని సోమవారం సర్పంచ్ భీంబాయి ప్రారంభించారు.

**చెన్నూర్‌రూరల్:** మండలంలోని ఆస్నాదలో కంటి వెలుగు శిబిరాన్ని ఎంపీపీ మంత్రి బాపు, జెడ్పీటీసీ మోతె తిరుపతి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగభూషణం, ఉప సర్పంచ్ శ్రీనివాస్, ఎంపీటీసీ వసంత, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**భీమిని:** కన్నెపల్లి మండలంలోని ముత్తాపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని జెడ్పీ సీఈఓ నరేందర్, జెడ్పీటీసీ సత్యనారాయణ, సర్పంచ్ సుంకరి తిరుపతి పరిశీలించారు. అనంతరం కన్నెపల్లి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణిలో పాల్గొని వినతులు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాధాకిషన్, ఎంపీవో సతీష్, ఏపీఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

### పరీక్ష ఫీజు చెల్లించాలి

**దండేపల్లి:** ఏప్రిల్, మే నెలలో జరిగే ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలకు సంబంధించిన పరీక్ష ఫీజును ఈ నెల 10వ తేదీలోగా చెల్లించాలని, దండేపల్లి ఓపెన్ స్కూల్ కో ఆర్డినేటర్ వరలక్ష్మి, సహాయ కో ఆర్డినేటర్ రాజేశ్వర్‌రావు తెలిపారు. 2022-23లో అడ్మిషన్ పొందిన వారితో పాటు, గత నాలుగేళ్లుగా ప్రవేశం పొంది, ఫెయిల్ అయిన వారు, ఫీజు చెల్లించని వారు ఇప్పుడు చెల్లించి పరీక్ష రాయవచ్చన్నారు. మరిన్ని వివరాలకు అధ్యయన కేంద్రంలో సంప్రదించవచ్చన్నారు.

### ప్రభుత్వవిప్‌కు కృతజ్ఞతలు



సుమన్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న లంబాడాలు

**భీమారం:** మండలంలోని బూర్గుపల్లిలో సేవాలాల్ దేవాలయానికి రూ.12లక్షలు మంజూరు చేసినందుకు ప్రభుత్వవిప్ బాల్కసుమన్‌కు సోమవారం లంబాడా కులస్తులు హైదరాబాద్‌లో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఇందులో చెన్నూరు మార్కెటింగ్ కమిటీ డైరెక్టర్ బుక్యా రాజ్‌కుమార్‌నాయక్‌తో పాటు నాయకులు, కులస్తులు పాల్గొన్నారు.

### ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలి

**లక్సెట్టిపేట:** చదువు మధ్యలో ఆపేసిన విద్యార్థులు అంబేద్కర్ స్టడీ సెంటర్ ద్వారా మళ్లీ కొనసాగించవచ్చని మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జై కిసన్ ఓజా అన్నారు. మండల కేంద్రలలోని డిగ్రీ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన డాక్టర్ బీ ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ 40వ వసంత వేడుకల్లో మాట్లాడారు. ఓపెన్ యూనివర్సిటీ ద్వారా చదువు మళ్లీ కొనసాగించవచ్చని, ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. కో ఆర్డినేటర్ కుమారస్వామి, అధ్యాపకులు సురేష్, శ్రీనివాస్, సంధ్యారాణి, కవిత పాల్గొన్నారు.

# 'ప్రజావాణి'కి స్పందన అంతంతే..!



భీమారం: దరఖాస్తు స్వీకరిస్తున్న ఎంపీడీవో



మందమర్రిరూరల్: తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం ఇస్తున్న బాధితులు

**భీమారం:** ప్రజల సమస్యల పరిష్కారానికి ఏర్పాటు చేసిన ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాస్ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో అంకుసాపూర్ గ్రామానికి చెందిన రాజన్న అనే వ్యక్తి ఇచ్చిన దరఖాస్తుని తీసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ జిల్లా కేంద్రానికి వెళ్లకుండా మండల స్థాయిలో సమస్యని తెలిపితే పరిష్కరిస్తామని తెలిపారు. ఇందులో తహసీల్దార్ వాసంతితో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

**చెన్నూర్‌లో ఒకే ఫిర్యాదు..**

**చెన్నూర్‌రూరల్:** చెన్నూర్‌లోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించగా కత్తెరసాల గ్రామంలో రెవెన్యూకు సంబంధించిన ఒకే ఒక్క ఫిర్యాదు వచ్చింది. ప్రజావాణిలో మండల ప్రత్యేకాధికారి కృష్ణ, ఎంపీడీవో టి.శ్రీనివాస్, ఎంఈవో రాధాకృష్ణమూర్తి, ఎంపీవో అజ్మత్ అలీ, ఈజీఎస్ ఏపీవో గంగాభవాణి, ఐకేపీ ఏపీఎం ప్రమీల, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

**'అక్రమంగా చేసిన పట్టాను రద్దు చేయాలి'**

**మందమర్రిరూరల్:** స్థానికంగా నిర్వహించిన ప్రజావాణిలో మండలంలోని పులిమడుగు గ్రామ పంచాయతీ పరిధిలోని కుసుసోత్ హునికి చెందిన భూమిని కుటుంబసభ్యులకు సమాచారం ఇవ్వకుండా ఒక్కరికే అక్రమంగా చేసిన పట్టాను రద్దు చేయాలని హుని కుటుంబసభ్యులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు.

**జైపూర్, వేమనపల్లిలో దరఖాస్తులు నిల్**

**జైపూర్:** స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఒక్క ఫిర్యాదు కూడా రాలేదు. ప్రజావాణికి అధికారులందరూ హాజరు కావాలని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేక అధికారి ప్రభాకర్‌రావు తెలిపారు.

**వేమనపల్లి:** స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి అధికారులు, ప్రజలు కనబడలేదు. ఎలాంటి అర్జీలు రాలేదు. కార్యక్రమంలో ఎంపీడీవో లక్ష్మయ్య, ఎంపీవో బాపురావు, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

### వాలీబాల్ విజేతలకు బహుమతులు ప్రదానం



గెలుపొందిన జట్టుతో నిర్వాహకులు

**జన్నారం:** నరనారాయణ స్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా కలమడుగు గ్రామంలో నిర్వహించిన జిల్లా స్థాయి వాలీబాల్ పోటీల్లో గెలుపొందిన సభ్యులకు సోమవారం బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి మతాడి జట్టు, రెండో బహుమతి ఖానాపూర్ జట్లు గెలుచుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

## సంక్షిప్త వార్తలు

**ఎయిడ్స్‌పై అవగాహన**

**మంచిర్యాలటౌన్:** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ సోమవారం జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలో, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద హెచ్ఐవీ ఎయిడ్స్‌పై జిల్లా కళాకారులు జన జాగృతి కళాబృందంతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమలలో జిల్లా ఎయిడ్స్ సూపర్‌వైజర్ అనిల్‌కుమార్, మాస్ మీడియా అధికారి వెంకటేశ్వర్లు, ఐసీటీసీ డీయస్ ఆర్‌సీ కౌన్సిలర్లు, లింక్ వర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

**ఆక్రమణకు గురైన భూమిని కాపాడాలి**

**చెన్నూర్:** స్థానికంగా పని చేస్తున్న విలేకరులకు సర్వే నెంబర్ 863లో కేటాయించిన రెండెకరాల భూమి అమ్మకాలు జరిగి చేతులు మారాయని, స్థానిక విలేకరులు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్ దేశ్‌పాండేకు వినతిపత్రం అందజేశారు. అక్రమణకు గురైన భూమిని కాపాడాలని కోరారు.

**పోడు భూములకు పట్టాలివ్వాలి**

**నెన్నెల:** మండలంలోని కర్జి, జంగల్‌పేట శివారులో గల భూములకు పట్టాలివ్వాలని సోమవారం ఆ గ్రామాల పోడుదారులు ఎంపీడీవో వరలక్ష్మికి వినతిపత్రం సమర్పించారు. సమగ్ర విచారణ చేసి హక్కు పత్రాలు ఇవ్వాలని కోరారు.

**నియామకం**

**కాసిపేట:** తెలంగాణ నేతకాని మహార్ కులహక్కుల పరిరక్షణ సంఘం జాతీయ, రాష్ట్ర, జిల్లా నాయకుల ఆదేశాల మేరకు మండలంలో సమావేశమై మండల కమిటీ, మహిళా కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నాగరాజు కమిటీ బాధ్యులకు నియామక పత్రాలు అందజేశారు.

**జిల్లా కమిటీ సమావేశం**

**నెన్నెల:** మండలంలోని గుండ్లసోమారంలో ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీ సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో పలు అంశాలను చర్చించి తీర్మానాలు చేశారు. పోడు భూములకు పట్టాలివ్వాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 7న మండల కేంద్రాల్లో ధర్నా చేయాలని, 13న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టాలని తీర్మానం చేశారు.

# ప్రభుత్వ భూమిలో వేసిన పోల్స్, ఫెన్సింగ్ తొలగింపు



పోల్స్ తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

**తాండూర్:** మండల కేంద్రం ఆర్అండ్ బీ గెస్టహౌజ్ పక్కన ఉన్న ప్రభుత్వ భూమిని కబ్జా చేయడానికి కొందరు వేసిన ఫెన్సింగ్‌ను సోమవారం రెవెన్యూ అధికారులు తొలగించారు. ఖాళీగా ఉన్న విలువైన ఇరిగేషన్ శాఖకు చెందిన భూమిపై కొందరు కన్నేశారు. ఆ భూమిని కబ్జా చేయడానికి చుట్టూరా సిమెంట్ పోల్స్ పాతి, కొంత మొత్తంగా ఫెన్సింగ్ వేశారు. తమ శాఖకు చెందిన భూమిని అక్రమార్కులు కబ్జా చేస్తున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఏఈ రవీందర్ తహసీల్దార్ కవితకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన తహసీల్దార్ కవిత ఘటనాస్థలికి వెళ్లి ఆక్రమణకు యత్నించిన భూమి చుట్టూరా పాతిన సిమెంట్ పోల్స్‌ను సిబ్బందితో తొలిగించి, ఫెన్సింగ్‌ను తీయించేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటే చర్యలు తప్పవని తహసీల్దార్ కవిత అక్రమార్కులను హెచ్చరించారు. కార్యక్రమంలో రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.

# నర్సరీల నిర్వహణ సక్రమంగా ఉండాలి



మొక్కలు పరిశీలిస్తున్న ఎంపీడీవో, ఎంపీవో

**కోటపల్లి:** పంచాయతీల్లో చేపడుతున్న నర్సరీ నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎంపీడీవో భాస్కర్ సూచించారు. మండలంలోని కోటపల్లి, శెట్‌పల్లి గ్రామాల్లోని నర్సరీలను సోమవారం పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలను జాగ్రత్తగా పెంచాలని సూచించారు. నిర్దేశించిన లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. నర్సరీ పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్యదర్శి శంకర్, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

**భీమారం:** మండలంలోని 11గ్రామ పంచాయతీల్లో హరితహారం కింద చేపట్టిన నర్సరీల్లోని మొక్కలను వందశాతం రక్షించేందుకు చర్యలు చేపట్టినట్లు ఎంపీడీవో శ్రీనివాస్ తెలిపారు. భీమారం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో పెంచుతున్న నర్సరీని సోమవారం ఎంపీవో సతీష్‌రెడ్డితో కలిసి సందర్శించారు. ఇందులో కార్యదర్శి వేముల శ్రీనివాస్‌తో పాటు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

## కనుల పండువగా రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

**జన్నారం:** మండలంలోని కలమడుగు శ్రీ నరనారాయణ స్వామి ఆలయ 38వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం రథోత్సవం నిర్వహించారు. నరనారాయణ స్వామి, ఆంజనేయస్వాములకు అభిషేకం చేసి, ఆలయ పూజారులు కాకర నర్సయ్య, రాజనరేంద్రల శర్మ ఆధ్వర్యంలో స్వామి వారి రథాన్ని ఊరేగించారు. మండలంతో పాటు కడెం, ఖానాపూర్, దండేపల్లి మండలాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో సర్పంచ్ కార్తీకరావు, ఉప సర్పంచ్ రాజ్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ సతీష్‌కుమార్, కమిటీ సభ్యులు కిషన్ గౌడ్, అంజగౌడ్, శంకరయ్య, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.



తుల భారం వేయిస్తున్న దంపతులు